# 50 ఏండ్లలో చేయని అభివృద్ధిని పదేండ్లలో చేశాం

- పెండింగ్ పనుల పూర్తికి మరోసారి ఆశీర్వదించండి
- బీఆర్ఎస్ మిర్యాలగూడ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు



బీఆర్ఎస్ మిర్యాలగూడ అభ్యర్థి, ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

మిర్యాలగూడ, నవంబర్ 28 : మిర్యాలగూడ నియోజకవర్గంలో పదేండ్లుగా అనేక అభివృద్ధి పనులు చేశానని, ప్రజలు విజ్ఞతతో ఆలోచించి అభివృద్ధిని కొనసాగించేందుకు తనను మరో మారు ఆశీర్వదించాలని బీఆర్ఎస్ మిర్యాలగూడ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు కోరారు. మంగళవారం నమస్తే తెలంగాణతో మాట్లాడుతూ పదేండ్ల కాలంలో మిర్యాలగూడ నియోజకవర్గంలోని 119 గ్రామపంచాయతీలను, మిర్యాలగూడ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ముందుకు తీసుకుపోయానన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 90 శాతానికి పైగా సీసీ రోడ్లు, బీటీరోడ్లు నిర్మించినట్లు చెప్పారు. అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందించానని పేర్కొన్నారు. వజీరాబాద్, ముదిమాణిక్యం మేజర్ల పరిధిలో బీళ్లు పడిన చివరి భూములకు సాగునీరు అందించేందుకు ఐదు లిఫ్టుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.1000కోట్లు మంజూరు చేయించానని తెలిపారు. వీటిలో మూడు లిఫ్టుల పనులు ఇప్పటికే మొదలయ్యాయని, మరో రెండు లిఫ్టులు టెండర్ దశలో ఉన్నాయని వివరించారు. మరో మారు తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే లిఫ్టుల నిర్మాణం ఏడాదిలోపు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. రూ.30వేల కోట్లతో దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ నిర్మాణం జరుగుతుందని, ఇది కూడా త్వరలో పూర్తి కానుందని తెలిపారు. ఈ ప్లాంట్‌లో స్థానికులైన నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తానన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో 2014 నుంచి 2023 వరకు రూ.4,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. గత 50 ఏండ్లుగా ఎమ్మెల్యేలుగా ఉన్నవారు చేసిన అభివృద్ధిని.. ఈ పదేండ్ల కాలంలో జరిగిన అభివృద్ధిని నియోజకవర్గ ప్రజలు పోల్చి చూడాలని సూచించారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ప్రకటించినట్లు సౌభాగ్య లక్ష్మి పథకం ద్వారా అర్హులైన మహిళలకు నెలకు రూ.3వేల భృతి అందిస్తామని, తెల్ల రేషన్ కార్డుదారులందరికీ అన్నపూర్ణ పథకం కింద సన్నబియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. పేద కుటుంబాలకు రూ.400కే వంట గ్యాస్ సిలిండర్ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆసరా పింఛను రూ.5,016కు, వికలాంగుల పింఛను రూ.6,016కు పెంచుతామన్నారు. కేసీఆర్ ఆరోగ్య రక్ష ద్వారా రూ.15లక్షల ఆరోగ్య బీమా అందిస్తామన్నారు.

### ఇంటింటికీ తాగునీరిచ్చినం

మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువుల అభివృద్ధి చేయడం ద్వారా గ్రామాల్లో భూ గర్భజలాలు గణనీయంగా పెరిగాయన్నారు. దాంతో రైతులు పంటలు పండించుకోవడమే కాకుండా రైతు కూలీలకు మంచి ఉపాధి లభిస్తున్నదని చెప్పారు. రైతుబంధు పథకం ద్వారా ఎకరాకు ఇప్పుడిస్తున్న రూ.10వేలను రూ.16వేలకు పెంచడం వల్ల రైతులకు లబ్ధి చేకూరనున్నదని పేర్కొన్నారు.

### ప్రచారానికి బ్రహ్మరథం

నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాలు, తండాలు, మిర్యాలగూడ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. సంక్షేమ పథకాలు అందాలంటే మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపించుకుంటామని ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దే అని, ఆయనను మూడోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు, మిర్యాలగూడలో మరింత అభివృద్ధి చేసుకునేందుకు ప్రజలందరూ కారు గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించి ఆదరించాలని కోరారు.

# పని చేసే ప్రభుత్వానికి అండగా ఉండాలి

- ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

హాలియా, నవంబర్ 28: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడే ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్‌తో కలిసి ఆయన హాలియాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం హాలియా ప్రధాన సెంటర్‌లో ఎమ్మెల్యే మాట్లాడారు. 40 ఏండ్ల క్రితం డొక్కు స్కూటర్ కూడా జానారెడ్డికి లేదని, నేడు వేల కోట్లకు ఎలా అధిపతి అయ్యాడో తెలపాలని ప్రశ్నించారు. ఆయన దాచుకున్న డబ్బులతో ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ గ్రామాల్లో మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులిచ్చే డబ్బులు, మద్యం సీసాలు తీసుకొని ఓటు మాత్రం కారు గుర్తుకు వేయాలని ఆయన సూచించారు. అధికారంలోకి వచ్చాక మిగిలిన పనులను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, మాజీ ఆప్కాబ్ చైర్మన్ యడవల్లి విజయేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశం, మున్సిపల్ వైస్ చైర్మన్ సుధాకర్, యడవల్లి మహేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు ప్రసాద్‌నాయక్, నల్లబోతువెంకటయ్య, కోఆప్షన్ సభ్యులు రావుల లింగమ్మ లింగయ్య, చాపల సైదులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఏర్పాట్లు పూర్తి : ఆర్డీఓ చెన్నయ్య

మిర్యాలగూడ, నవంబర్ 28: మిర్యాలగూడ శాసన సభ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ మెటీరియల్‌ను పంపిణీ చేసేందుకు డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్డీఓ చెన్నయ్య తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో డీఎస్పీ వెంకటగిరితో కలిసి మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలో 263 పోలింగ్ బూత్‌లు ఉండగా 178 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, 42 అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పా రు. 263 బూత్‌లలో మొత్తం 1847 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. 56 బస్సుల ద్వారా పోలింగ్ బూత్‌లకు సిబ్బందిని, మెటీరియల్‌ను తరలిస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ చెన్నయ్య. పక్కన డీఎస్పీ వెంకటగిరి

# 70 ఏండ్ల వెనుకబాటును రెండున్నరేండ్లలోనే రూపుమాపిన

ఇంటర్వ్యూ Interview

- సాగర్ నియోజకవర్గంలో రూ.1500 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు
- ఉప ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేశా
- నెల్లికల్లు లిఫ్ట్ నిర్మాణం కోసం రూ.680కోట్లు
- ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాం
- బీఆర్ఎస్ నాగార్జునసాగర్ అభ్యర్థి, ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్



బీఆర్ఎస్ నాగార్జునసాగర్ అభ్యర్థి, ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

హాలియా, నవంబర్ 28: నియోజకవర్గాన్ని రెండున్నరేండ్లలోనే అభివృద్ధి చేశానని, మళ్లీ ఆశీర్వదిస్తే... మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నారు. ఉప ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీలను అమలు చేయడంతో పాటు సీఎం కేసీఆర్ ఆశీస్సులు, మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి తోడ్పాటు, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి , ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్ సహకారంతో నియోజకవర్గానికి 1500 కోట్ల రూపాయల మేర నిధులను తీసుకొచ్చి అభివృద్ధికి పాటుపడ్డా. నియోజకవర్గంలో విద్య, వైద్యం, ప్రజా ఆరోగ్యం, తాగు, సాగునీరు, రోడ్లు, విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేశా. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి మళ్లీ గెలిపిస్తే వివిధ దశల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పూర్తి చేయించడంతో పాటు మరో రూ. 300 కోట్లను తెచ్చి గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు, రోడ్ల విస్తరణ, నూతన చెక్‌డ్యాంలు, లిఫ్టులు, వంతెనల నిర్మాణం చేపడుతాం. నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి, పలు అంశాలపై ఆయన మంగళవారం 'నమస్తే తెలంగాణ'తో ముచ్చటించారు.

### నెల్లికల్లు లిఫ్ట్‌ను పూర్తికి కృషి

గత 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు నెల్లికల్లులిఫ్ట్ నిర్మాణం పేరుతో ఓట్లు వేయించుకున్నారే తప్ప లిఫ్ట్ నిర్మాణం చేపట్టలేదు. 2018 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం కేసీఆర్ నెల్లికల్లు లిఫ్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మొదట 5000వేల ఎకరాలకు చేసిన నెల్లికల్లు లిఫ్ట్ డిజైన్ 24వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చేలా రీడిజైన్ చేయడంతో నిర్మాణం ఆలస్యమైంది. ప్రభుత్వం నెల్లికల్లు లిఫ్ట్ కోసం రూ. 680కోట్లను విడుదల చేసింది. ప్రస్తుతం నెల్లికల్లు లిఫ్ట్ నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. వచ్చే ఏప్రిల్‌నాటికి నెల్లికల్లు లిఫ్ట్ నిర్మాణం పూర్తి చేసి ప్రారంభిస్తాం. జూన్ నాటికి భూదు భూములకు సాగునీరు అందిస్తాం.

### డీ 8,9 కెనాల్స్ కింద 7136 ఎకరాలకు సాగునీరు

డీ 8, 9 కెనాల్స్ కింద 7136 ఎకరాలకు సాగునీరు అందించేందుకు పెద్దవూర మండలం పుల్యాతండా వద్ద రూ.2.5 కోట్ల తో వరద కాల్వపై ఏర్పాటు చేసిన లిఫ్ట్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇటీవల ట్రయల్‌రన్ కూడా చేశాం. ఎన్నికల అనంతరం డీ 8,9 కెనాల్స్‌కు లిఫ్ట్ ద్వారా సాగునీరు అందించాం. దీంతో 7136 ఎకరాలకు సాగునీరు అందుతుంది.

### హాలియా, నందికొండ మున్సిపాలిటీ అభివృద్ధి..

ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌ను 50 ఏండ్లుగా కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి చేయలేదు. 2018లో రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం హాలియా, నందికొండను మున్సిపాలిటీ చేసింది. హాలియా, నందికొండ మున్సిపాలిటీల్లో ఇప్పటికి 60 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం. అంతర్గత సీసీ రోడ్లను వేయడంతో పాటు హాలియా, నాగార్జున సాగర్‌లో మినీస్టేడియం, డిజిటల్ లైబ్రరి, ఆడిటోరియం, సాగర్‌లో ఆర్టీసీ బస్టాండ్ ఆధునీకరించాం. హాలియాలో ఎడమ కాల్వ వెంట మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దేందుకు పనులు చురుగ్గా సాగుతున్నాయి. మళ్లీ ఎమ్మెల్యే గెలిపిస్తే ఈ పనులను త్వరతిగతిన పూర్తి చేస్తా.

### బంజారాలకు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నాం

హాలియాలో బంజారా భవన్ ఏర్పాటు చేయాలన్నది గిరిజన నాయకులు చిరకాల కోరిక. 40 ఏండ్లుగా జానారెడ్డి గిరిజనులను ఓటు బ్యాంక్‌గా మాత్రమే వాడుకున్నారు. వారి అభివృద్ధికి పాటుపడిన దాఖలాలు లేవు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు గిరిజన తండాలను గ్రామ పంచాయతీలు చేయడంతో పాటు హాలియాలో గిరిజన భవన్ నిర్మాణం కోసం ప్రభుత్వం సుమారు 5కోట్ల రూపాయల విలువైన ఎకరం స్థలం కేటాయించింది. గిరిజన భవన్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 2 కోట్ల రూపాయలను విడుదల చేయగా నేను మరో కోటి రూపాయలను ఇచ్చా. ఇటీవల పనులు ప్రారంభమయ్యాయి. ఈ నెల 30న ఎన్నికల అనంతరం మళ్లీ నేను ఎమ్మెల్యే అయ్యాక త్వరలోనే పనులు పూర్తి చేయిస్తా.

### తిరుమలగిరి సాగర్ మండల అభివృద్ధి..

నాగార్జున సాగర్ నియోజకవర్గంలో అత్యంత వెనుకబడిన ప్రాంతం తిరుమలగిరి సాగర్ ప్రాంతం. ఇక్కడ గిరిజనులు ఎక్కువ. జానారెడ్డి 35 ఏండు ఎమ్మెల్యేగా, 16ఏండ్లు మంత్రిగా ఉన్నప్పటికి ఈ ప్రాంతాభివృద్ధికి పాటుపడలేదు. పరిపాలన సౌలభ్యం, గిరిజన అభివృద్ధి కోసం ప్రభుత్వం తిరుమలగిరి కేంద్రంగా తిరుమలగిరి సాగర్ మండలాన్ని ఏర్పాటుచేసింది. తిరుమలగిరి సాగర్ మండలానికి పీహెచ్‌సీతో పాటు జూనియర్ కళాశాల, అన్నిప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేశా.

### విద్యాభివృద్ధికి కృషి

మన ఊరు మన బడి ప్రణాళిక కింద రూ.20 కోట్లతో నియోజకవర్గంలో 117పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాం. హాలియాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నాగార్జున సాగర్‌లో బీసీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశాం. ఒక్క ప్రభుత్వ డిగ్రీ కళాశాల కూడా లేని నాగార్జున సాగర్ నియోజకవర్గంలో రెండు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తీసుకొచ్చా.

### నెరవేరిన సాగర్ ప్రజల సొంతింటి కల

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో సాగర్ కాలనీల్లో ఎన్‌ఎస్‌పీ క్వార్టర్స్ నిర్మించారు. 50 ఏండ్లుగా ఆ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న వాళ్లు తమకే క్వార్టర్స్ కేటాయించాలని కోరారు. జానారెడ్డి వారితో ఓట్లు వేయించుకున్నారే తప్ప వాళ్లకు క్వార్టర్స్ ఇవ్వలేదు. ఉప ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీ మేరకు సీఎం కేసీఆర్ ఎన్‌ఎస్‌పీ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న వారికే ఎన్‌ఎస్‌పీ క్వార్టర్స్ కేటాయించారు. బుద్ధవనం నిర్మాణం పూర్తి చేశాం.

### ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. నాగార్జునసాగర్‌లో 18 కోట్ల రూపాయలతో 100 పడకల ఆస్పత్రిని నిర్మించాం. చిల్డ్రన్స్ కేర్ యూనిట్‌తో పాటు ఇటీవల డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటుచేశాం. అదేవిధంగా హాలియాలో 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి 3.5 కోట్ల రూపాయలు మంజూరు చేయడంతో అదే విధంగా పోస్టుమార్టం సౌకర్యం కల్పించాం. నిడమనూరు, పెద్దవూర, త్రిపురారం మండలాల్లో పీహెచ్‌సీలకు నూతన భవనాల నిర్మాణానికి కోటి రూపాయలు మంజూరు చేయించాం.